క్లుప్తంగా

ఫీజు పోరు విజయవంతానికి పిలుపు

అమలాపురం టౌన్: అమలాపురం కలెక్టరేట్ వద్ద ఈనెల 5వ తేదీ ఉదయం జిల్లా వైఎస్సార్ సీపీ తలపెట్టిన ఫీజు పోరు ధర్నాకు పట్టణం లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని పిలుపునిచ్చారు. ఫీజు రియంబర్స్‌మెంట్ అందక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులకు వైఎస్సార్ సీపీ వారికి అండగా నిలిచి చేపడుతున్న ఈ ధర్నా ద్వారా చంద్రబాబు కూటమి సర్కార్‌పై నిరసన గళం వినిపించాలని విజ్ఞప్తి చేశారు. బాధిత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అమలాపురం కలెక్టరేట్‌కు ఆ రోజు రావాలని కోరారు.

విద్యార్థులు గణితంలో ప్రతిభ చాటాలి



విజేతలతో డీఈవో సలీమ్ బాషా తదితరులు

అమలాపురం టౌన్: విద్యార్థులు గణితంలో ప్రతిభ చాటాలని డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా అన్నారు. స్థానిక శ్రీ వాగ్దేవి స్కూలులో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. పోటీల్లో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు తమ వ్యక్తిగత ప్రతిభను చాటారు. అనంతరం విజేతలకు డీఈవో సలీమ్ బాషా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అబాకస్, వేదిక్ మ్యాథ్స్ ప్రతినిధులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పాటు శ్రీ వాగ్దేవి స్కూలు డైరెక్టర్ పరసా భరత్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు బాలకృష్ణకు సేవా పురస్కారం



బాలకృష్ణకు సేవా పురస్కారాన్ని అందిస్తున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కుంచె బాలకృష్ణకు ఉత్తమ సేవా పురస్కారాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ.నిషాంతి అందజేశారు. ఆయన సేవలను గుర్తించి 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ సేవా అవార్డును ప్రకటించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి ఆదివారం ఉపాధ్యాయుడికి ఉత్తమ సేవా అవార్డును అందించి ప్రత్యేకంగా అభినందించారు. అవార్డు అందుకున్న బాలకృష్ణను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజ రాజేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు.

రాజశేఖర్ విజయానికి కృషి చేయండి

ఐ.పోలవరం: పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసన సభ్యులు దాట్ల సుబ్బరాజు పిలుపునిచ్చారు. మురమళ్లలోని క్యాంపు కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు రాయపురెడ్డి నీలకంటేశ్వరరావు అధ్యక్షతన ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఆదివారం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముమ్మిడివరం నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోనంకి కృష్ణం నాయుడు నాయుడు హాజరయ్యారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, రాయపురెడ్డి నీలకంటేశ్వరరావు, మద్దింశెట్టి పురుషోత్తం, సాకా సీతాదేవి, సాగిరాజు, సూరిబాబు రాజు, కాకర్లపూడి రాజేష్‌లు పాల్గొన్నారు.

ఎస్సీ గ్రామాల్లో పనుల జాప్యంపై ఫిర్యాదు

యానాం: నియోజకవర్గ పరిధిలో ఎస్సీ గ్రామాల్లో పలు మౌలిక సౌకర్యాల నిర్మాణ పనులకు నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించకుండా ఏళ్లుగా సంబంధిత అధికారులు ఆలస్యం చేస్తున్నారని పేర్కొంటూ ఆదివారం ఆర్‌ఏఓ మునిస్వామికి పలువురు దళిత నాయకులు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ గ్రామాల్లో సిమెంటు రోడ్లు, ఓపెన్ ఆడిటోరియం పనులు, పాఠశాలలు, కళ్యాణ మండపాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. అయితే వాటి పనులు ప్రారంభించకుండా టెండర్లు దాఖలు కలేదని మూడేళ్లుగా అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కొందరి రాజకీయ నాయకుల మాటలు వింటూ పనులు నిలిపివేస్తే నిధులు వెనుకకు మళ్లిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై ఎల్జీ కైలాష్‌నాథన్, కేంద్ర హోం సెక్రటరీకి వినతి పత్రాలు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దరియాలతిప్ప పెద్దలు సబ్బతి శ్రీనివాసరావు, దాసరి బుజ్జి, బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

అమలు చేస్తారా.. అటకెక్కిస్తారా..!

- పట్టణాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అమలుపై ఊపందుకున్న చర్చలు
- రూ.65 కోట్ల అంచనా వ్యయంతో రూపకల్పన
- వచ్చే నెలలో అమలు చేస్తామని ఎమ్మెల్యే ప్రకటన
- స్వల్ప వ్యవధి మాత్రమే ఉండడంతో సర్వత్రా ఉత్కంఠ
- అమలైతే రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ నియంత్రణకు పరిష్కారం



అమలాపురంలో ఈదరపల్లి ప్రధాన వంతెన వద్ద స్తంభించిన ట్రాఫిక్ (ఫైల్)

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం జిల్లా కేంద్రం అయ్యాక కొంతమేర అభివృద్ధి సాకారమైన విషయం వాస్తవమే. అదే సమయంలో ఇరుకు రోడ్లు, శిథిల వంతెనలు, ట్రాఫిక్ ఇబ్బందులు జిల్లా కేంద్రాన్ని వెక్కిరిస్తున్నాయి. ఈ సమస్యలన్నింటికీ ఏకైక పరిష్కారం మాస్టర్ ప్లాన్ అమలు ఒక్కటే. ఆ ప్లాన్ ఎంత త్వరితగతిన అమలైతే అంత తొందరగా పట్టణంలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. 7.02 కిలోమీటర్ల విస్తీర్ణంతో దాదాపు 54 వేల మంది జనాభాతో విస్తరించి ఉన్న పట్టణాన్ని ప్రధానంగా శిథిల వంతెనలు, ఇరుకు రోడ్ల సమస్య వేధిస్తోంది. దీంతో ట్రాఫిక్ సమస్యలు అనివార్యంగా మారాయి. జిల్లా కేంద్రం అయ్యాక ఈ సమస్యలు మరీ జటిలమయ్యాయి. పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలైతే 40 నుంచి 60 అడుగుల మేర రోడ్లు విస్తరించనున్నాయి. ట్రాఫిక్ సమస్యకు కారణమవుతున్న పట్టణ ప్రవేశ మార్గాలైన ఈదరపల్లి, నల్ల, ఎర్ర వంతెనలు కీలకంగా ఉన్నాయి. ఈ మూడు వంతెనలతో పాటు మరో నాలుగు వంతెనల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌లో చేర్చినట్లు స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఇటీవల కాలంలో పదే పదే చెబుతున్నారు. మాస్టర్ ప్లాన్ అమలుకు రూ.65 కోట్లతో అంచనాలు కూడా రూపొందించినట్లు గత నెల 27న జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వెల్లడించారు.

ఆచరణ సాధ్యమేనా..

వచ్చేనెల మార్చి నాటికి పట్టణంలో ట్రాఫిక్ సమస్యతో పాటు శిథిలావస్థతో సతమతమవుతున్న ఈదరపల్లి వంతెనకు ప్రత్యామ్నాయ వంతెన నిర్మిస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. అధికారులు, పట్టణ ప్రజలు మార్చి నెలాఖరుకు ప్లాన్ అమలు సాధ్యమవుతుందా...? అనే సందేహాలను వ్యక్తం చేస్తున్నారు. మాస్టర్ ప్లాన్‌లో ఇమిడి ఉన్న వంతెనల ఆధునీకరణ, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఈ రెండు నెలల్లో సాకారం అవుతాయా..? అనేవి సమాధానం లేని ప్రశ్నలుగా మారాయి.

ట్రాఫిక్‌తో సతమతం

పట్టణాన్ని నిత్యం ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తోంది. పోలీసులు సైతం ఒక్కోసారి ట్రాఫిక్‌ను నియంత్రించలేక చేతులెత్తేస్తున్నారు. రోజూ ట్రాఫిక్‌తో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ఈదరపల్లి వంతెన నేనిక సేవలు అందించలేనంటూ శిథిలావస్థకు చేరి రోధిస్తోంది. మాస్టర్ ప్లాన్ అమలు ఎలా ఉన్నా ముందు ఈదరపల్లి వంతెనను ఆధునీకరించండి మహాప్రభో.. అంటూ పట్టణ ప్రజలే కాక పట్టణానికి పలు పనులపై వస్తున్న జిల్లా ప్రజానీకం సైతం అభ్యర్థిస్తున్నారు. మాస్టర్ ప్లాన్ నివేదిక టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్‌కు వెళ్లింది. ఆ కంట్రీ ప్లానింగ్ నుంచి అమలాపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అముడా)కి వెళ్లింది. నివేదికను ఆద్యంతం అధ్యయనం చేసిన పిదప ప్లాన్ అమలుకు జీవో విడుదల కావాల్సి ఉంది. రానున్న రెండు నెలల్లో ఈ ప్రక్రియ అంతా పూర్తయి జీవో వస్తే సరేసరి. లేని పక్షంలో అమలాపురం వాసుల కష్టాలు యథాతథంగా కొనసాగనున్నాయి.

వాహనాల నిలిపివేత సాధ్యమేనా..?

శిథిల స్థితికి చేరుకున్న ఈదరపల్లి వంతెన ఏ క్షణానైనా కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే ఆనందరావు తాజాగా జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ వంతెన నిర్మించేలోపు ఆ వంతెనపై భారీ వాహనాలను నిలిపి వేయాలని ఎమ్మెల్యే అధికారులను సూచించారు. ప్రత్యామ్నాయ వంతెన నిర్మించాకే పాత వంతెనపై భారీ వాహనాలను నిలిపివేసే అంశం గురించి ఆలోచించాలి. ఎందుకుంటే పట్టణం మీదుగా భారీ వాహనాలు వెళ్లాలన్నా, పట్టణంలోనికి రావాలన్నా ఈ వంతెన మీదుగానే రావాల్సి ఉంది. దీంతో భారీ వాహనాల నిలిపివేత సాధ్యం కాదని అధికారులే మల్లగుల్లాలు పడుతున్నారు.

జీవో రావాల్సి ఉంది

> మాస్టర్ ప్లాన్ అమలుకు జీవో రావాల్సి ఉంది. టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ నుంచి ప్లాన్ అముడాకి వెళ్లింది. ఈ జీవో రాక కోసం ఎదురు చూస్తున్నాం. జీవో వచ్చిన తర్వాత ప్లాన్ అమలుకు త్వరిత గతిన చర్యలు చేపడతాం.
>
> కేవీఆర్ఆర్ రాజు, మున్సిపల్ కమిషనర్, అమలాపురం.

బాధిత బాలికకు రూ.3 లక్షల సాయం



బాలికకు ఆర్థిక సాయం అందజేస్తున్న శెట్టిబలిజ హెల్పింగ్ హేండ్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: అల్లవరం మండలం గోడి గ్రామానికి చెందిన చిన్నారి కేతా లాస్య మాధురి తన ఇంటి డాబాపై ఆడుకుంటూ విద్యుత్ తీగలు తాకడంతో చేయి కోల్పోయి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. వారిది పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్న క్రమంలో అమలాపురం శెట్టిబలిజ హెల్పింగ్ హేండ్స్ సంస్థ మానవత్వంతో ముందుకు వచ్చి ఆ బాధిత బాలికకు రూ.3 లక్షల సాయం అందించింది. ఈ సాయాన్ని కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందతున్న లాస్య కుటుంబానికి అందజేసినట్లు శెట్టిబలిజ హెల్పింగ్ హేండ్స్ ప్రతినిధులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, గొవ్వాల రాజేష్‌లు తెలిపారు. శెట్టిబలిజ హెల్పింగ్ హేండ్స్ సంస్థ రూ.1.50 లక్షలు సమకూర్చగా ఆ సంస్థ ప్రతినిధి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు కుమారులు ధనుష్, హనీష్‌లు రూ.60 వేలు, మున్సిపల్ కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ మిత్ర బృందం రూ.35 వేలు, ముమ్మిడివరం శెట్టిబలిజ హెల్పింగ్ హేండ్స్ ప్రతినిధులు రూ.30 వేలు, హైదరాబాద్ స్మైలీ ఫౌండేషన్ ప్రతినిధులు రూ.25 వేలు సమకూర్చారు. కార్యక్రమంలో ప్రతినిధులు మట్టపర్తి నాగేంద్ర, చెల్లుబోయిన నాని, ఇళ్ల శేషగిరిరావు, విత్తనాల శేఖర్, దొమ్మేటి రాము, కముజు రమణ, కేతా భానుతేజ, కడలి నాగు, రెడ్డి శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ ఆస్తులను ప్రభుత్వమే సంరక్షించాలి

వీహెచ్‌పీ రాష్ట్ర మహిళా ప్రముఖ్ సునీత



వీహెచ్‌పీ సమావేశంలో చర్చిస్తున్న ధార్మిక సంస్థల ప్రతినిధులు

అమలాపురం టౌన్: దేవదాయ భూములు, ఆస్తులు ఆక్రమణలకు గురి కాకుండా ప్రభుత్వమే సంరక్షించాలని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) రాష్ట్ర మహిళా ప్రముఖ్ సునీత అన్నారు. వాటిని కాపాడే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని గుర్తు చేశారు. స్థానిక సుబ్బారాయుడి చెరువు వద్ద ఆదివారం జరిగిన వీహెచ్‌పీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం హైందవ ధర్మం, హిందూ మతం విశిష్టత అనే అంశాలపై సాగింది. ఇటీవల కాలంలో హిందూ సమాజం చైతన్యంతో ముందుకు సాగుతోందని సునీత పేర్కొన్నారు. అంతర్వేది ఉత్సవాల్లో సామాన్య భక్తులందరికీ ఉచిత దర్శనం ఏర్పాటు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. వీహెచ్‌పీని క్షేత్ర స్థాయిలో బలపరిచేందుకు వచ్చే వేసవి సెలవుల్లో హిందూ యువతకు వారం రోజుల పాటు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ప్రయాగ నరసింహమూర్తి తెలిపారు. సమావేశంలో భజరంగ్ దళ్ రాష్ట్ర సహాయ ప్రముఖ్ శిరంగు నాయుడు, ధార్మిక సంస్థల ప్రతినిధులు గంధం గోవింద్, గుత్తుల సుగుణ, ఊటుకూరి సాంబయ్య, నంద్యాల సీతారామ్, యక్కల బ్రహ్మేష్ తదితరులు పాల్గొన్నారు.

దొమ్మేటి మృతి తీరని లోటు

ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు



సంతాప సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి వితరణ శీలిగా పేరు గాంచిన దొమ్మేటి వెంకట బాబూరావు మృతి శెట్టిబలిజ జాతికి తీరని లోటని ఎమ్మెల్సీ, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టి బలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక హైస్కూలు సెంటరులో ఆదివారం సాయంత్రం గౌతమీ తీర శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో జరిగిన బాబూరావు సంతాప సభలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడారు. ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు అధ్యక్షుడు పిల్లి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సంతాప సభ వెంకట బాబూరావు చేసిన సేవా కార్యక్రమాల గురించి ప్రస్తావించింది. రంగూన్‌లో విద్యాభ్యాసం చేసి ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా ఎదిగారని వక్తలు పేర్కొన్నారు. 350 ఎకరాలు వివిధ సంస్థలకు దారాదత్తం చేసినప్పటికీ బాబూరావు కుటుంబీకులు అతి సామాన్య జీవితం గడిపారన్నారు. శెట్టి బలిజ సంఘాల నాయకులు మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి త్రినాథ్, గుత్తుల రాంబాబు, వాసర్ల సుబ్బారావు, బొక్కా రామకృష్ణారావు, గుత్తుల మధుసూదనరావు, ముషిణి వివేకానంద పాల్గొన్నారు.

నేడు దొమ్మేటి అంత్యక్రియలు

అల్లవరం: శెట్టి బలిజ వ్యవస్థాపకులు, మాజీ సర్పంచ్ దొమ్మేటి వెంకటస్వామి అంత్యక్రియలు బోడసకుర్రులో సోమవారం నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. వెంకట స్వామి భౌతిక కాయాన్ని హైదరాబాద్ నుంచి ప్రత్యేక వాహనంలో బోడసకుర్రు మేడ వద్దకు తీసుకొచ్చి అభిమానుల సందర్శనార్థం ఉంచుతున్నట్లు చెప్పారు. అనంతరం శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

గెలుపే ధ్యేయంగా ఎన్నికల బరిలోకి..

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్



యానాం: పుదుచ్చేరి అసెంబ్లీకి వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో యానాం నియోజకవర్గం నుంచి గెలిపే లక్ష్యంగా తాను బరిలోకి దిగుతానని, పోటీ నుంచి ఉపసంహరించుకునే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల ఆశీర్వాదం తనకు ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు వస్తున్న వార్తలను ఆయన కొట్టి పడేశారు. అలాంటి సత్య దూరమైన వార్తలను ఎవరూ నమ్మవద్దని కార్యకర్తలు, అభిమానులకు విజ్ఞప్తి చేశారు. గత కొన్ని రోజులుగా తనకు ఆరోగ్యం సహకరించక పోవడం వల్ల ప్రజలకు అందుబాటులో లేనట్లు పేర్కొన్నారు. దీంతో కొంత మంది అసత్య వార్తలను ప్రచారం చేస్తుండటాన్ని ఆయన ఖండించారు. నియోజకవర్గానికి తన కృషితో కోట్లాది రూపాయల ఎమ్మెల్యే ల్యాడ్ నిధులు, సీఎస్ఆర్ నిధులు మంజూరైనప్పటికీ పనులు జరగకుండా అడ్డంకులు సృష్టిస్తూ ఎవరు నిలిపి వేస్తున్నారో నియోజకవర్గ ప్రజలకు తెలుసునన్నారు. వచ్చే ఎన్నికలో అలాంటి వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

ముత్తాబత్తుల కుటుంబీకుల ఆత్మీయ కలయిక



పేరూరులో కలుసుకున్న ముత్తాబత్తుల కుటుంబ సభ్యులు

అమలాపురం రూరల్: ముత్తాబత్తుల కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయిక మొదటి వార్షికోత్సవం మండలంలోని పేరూరు గ్రామంలో ఆదివారం ఉత్సాహ భరిత వాతావరణంలో జరిగింది. ఈ సమావేశానికి సర్పంచ్ దాసరి అరుణ హాజరై మాట్లాడారు. ముత్తాబత్తుల వారి ఆత్మీయ కలయిక ఏర్పాటు చేయడం అనంద దాయకమని అన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకట్రావు మాట్లాడుతూ పేద, ధనిక తారతమ్యాలు లేకుండా అంతా ఒకే చోట చేరి మొదటి వార్షికోత్సవంలో కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు ముత్తాబత్తుల సత్యనారాయణ, కాలేజీ డైరెక్టర్ ముత్తాబత్తుల రత్న కుమార్, ముత్తాబత్తుల వెంకట్రావు, నాగేశ్వరరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులు జిల్లాలోనే నిర్వహించాలి



మాట్లాడుతున్న వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణమూర్తి

అమలాపురం టౌన్: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం శిక్షణా తరగతులు కాకినాడ జిల్లాలో కాకుండా కోనసీమ జిల్లాలోనే నిర్వహించాలని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దేవాదాలు సూర్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. అమలాపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకినాడ జిల్లాలో శిక్షణా తరగతులు నిర్వహిస్తామని అధికారులు చెబుతున్న క్రమంలో వేరే జిల్లాలో జరిగే తరగతులకు జిల్లా నుంచి వెళ్లే అభ్యర్థుల ఇబ్బందులను ఆయన వివరించారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో ఏ జిల్లాకు ఆ జిల్లాలోనే తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూర్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు, వివిధ వర్కర్ల యూనియన్ల నాయకులు మస్కూరి ఏసుబాబు, తవిటికి అరుణ కుమార్, కొనుకు వెంకటేశ్వరరావు, పితాని బేబీరావు, కముజు సుందరరావు, పెదపూడి కృష్ణ తదితరులు మాట్లాడారు.

వైభవంగా నాగ ప్రతిష్ఠలు



పాశర్లపూడిలంకలో నాగప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్న భక్త దంపతులు

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీతీరం పాశర్లపూడిలంకలో కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత నాగేంద్రస్వామి ఆలయం వద్ద నాగ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్త దంపతులు ఈ నాగ ప్రతిష్ఠలో పాల్గొన్నారు. వేద పండితులు ఆదిరాజు నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. కుటుంబ వృద్ధితో పాటు సంతానం కోసం పలువురు దంపతులు, వివాహం కొరకు యువతీ, యువకులు ఈ నాగ ప్రతిష్ఠ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నాగదేవతల ప్రతిమలకు పూజలు నిర్వహించిన తర్వాత వాటిని ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. ముందుగా నాగేంద్రస్వామికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు గంటి బాలసుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణలు, భక్తుల కోలాహలం మధ్య శాస్త్రోక్తంగా నాగేంద్రస్వామికి పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి లక్ష బిల్వార్చన, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి సహస్ర కుంకుమార్చన జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. ఉత్సవాల సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయం వద్ద మంగళవారం అన్నసమారాధన ఏర్పాటు చేశామన్నారు.

ఆశలు ఆవిరి..!

- కాట్రేనికోన సబ్ స్టేషన్‌కు మరోసారి మొండిచేయి
- ఇక్కడ ఏర్పాటు చేయాల్సిన 8 మెగావాట్ల పీటీఆర్ చెయ్యేరుకు తరలింపు
- ఆక్వా సాగుదారులపై అధికారుల ప్రత్యేక శ్రద్ధ
- సామాన్య వినియోగదారులను విస్మరిస్తున్న వైనం



చెయ్యేరు సబ్ స్టేషన్‌లో 8 మెగావాట్ల పీటీఆర్ నిర్మాణ పనులు

కాట్రేనికోన: దేవుడు వరమిచ్చినా పూజారి వరమీయని చందంగా కాట్రేనికోన సబ్ స్టేషన్‌కు మరోసారి రిక్త హస్తమే మిగిలింది. ఇక్కడ ఏర్పాటు చేయాల్సిన 8 మెగావాట్ల పీటీఆర్(పవర్ ట్రాన్స్‌ఫార్మర్ యూనిట్)చెయ్యేరు సబ్‌స్టేషన్‌కు తరలిపోయింది. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా అధికారులు తీసుకున్న నిర్ణయం 11 గ్రామాల ప్రజలకు శాపంగా మారింది. కాట్రేనికోన సబ్ స్టేషన్‌కు విద్యుత్ శాఖ అధికారులు రెండో సారి మొండి చేయి చూపించారనే ఆరోపణలు ఉన్నాయి. వడ్డించేవాడు మనవాడైతే ఎక్కడ కూర్చున్నా పరవాలేదన్న సామెత చందంగా విద్యుత్ శాఖ అధికారుల తీరుకు పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు. మండలంలో కాట్రేనికోన సబ్ స్టేషన్ పరిధిలో 16,169, చెయ్యేరు సబ్ స్టేషన్ పరిధిలో 3,606 విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. చెయ్యేరులో ఆక్వా సాగుకు అవసరమైన సరఫరాపై విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక ప్రేమను చూపిస్తూ విశేష ఏర్పాట్లు చేస్తున్న విషయం మండల ప్రజలకు విదితమే. గతంలో కాట్రేనికోన, చెయ్యేరు సబ్ స్టేషన్లకు పీటీఆర్‌లు రెండేసి చొప్పున ఉండేవి. వేసవిలో విద్యుత్ కోతల దృష్ట్యా 8 మెగావాట్ల పీటిఆర్‌ను కాట్రేనికోన సబ్ స్టేషన్‌కు మంజూరు చేశారు. ఆక్వా పరిశ్రమలో కాసుల రాబడితో 8 మెగావాట్ల పీటీఆర్‌ను చెయ్యేరుకు తరలించారనే ఆరోపణలు ఉన్నాయి. కాట్రేనికోన సబ్ స్టేషన్ పరిధిలో 16,169 సర్వీసులతో పాటు లోవోల్టేజీ సమస్యతో శివారు గ్రామాలకు విద్యుత్ సరఫరా చేయడం సిబ్బందికి కత్తిమీద సాముగా మారింది. విద్యుత్ కోతలు, మండల ప్రజల ఇబ్బందులపై గత నెల 3న సాక్షి దిన పత్రికలో 'విద్యుత్ వినియోగదారుల వెతలు' అనే శీర్షికతో కథనం వెలువడడంతో విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. కాట్రేనికోన సబ్ స్టేషన్‌ను గత నెల 13న పరిశీలించిన ఉన్నత స్థాయి అధికారులు 8 మెగావాట్ల పీటీఆర్‌ను మంజూరు చేసి వేసేందుకు సిద్ధమయ్యారు. అయితే విద్యుత్ శాఖ అధికారులకు ఆక్వా పరిశ్రమపై ఉన్న ప్రేమ ముందు కాట్రేనికోన సబ్ స్టేషన్ వినియోగదారుల కష్టాలు కనపడలేదు. కాట్రేనికోన సబ్ స్టేషన్‌లో 8 మెగావాట్ల పీటీఆర్‌ను వేసి విద్యుత్ కోతలకు చెక్ పెడతామని చెప్పిన అధికారులు చెయ్యేరు సబ్ స్టేషన్‌కు తరలించారు. ఉన్నత స్థాయి అధికారులు, విజిలెన్సు అధికారులకు ఫిర్యాదు చేస్తామని స్థానిక విద్యుత్ వినియోగదారులు పేర్కొన్నారు.దీనిపై కోనసీమ జిల్లా ఎస్ఈ రాజబాబుని ఫోన్‌లో వివరణ కోరగా సమాధానం చెప్పకుండా దాటవేశారు.

'డయల్ యువర్ కమిషనర్' రద్దు

అమలాపురం టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో అమలాపురం మున్సిపల్ కార్యాయలంలో ప్రతి సోమవారం నిర్వహించ తలపెట్టిన 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేసుకున్నప్పటికీ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో విరమించుకున్నారు. వచ్చేనెల 8వ తేదీన తిరిగి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని కమిషనర్ రాజు పేర్కొన్నారు.

వీరేశ్వరస్వామి సన్నిధిలో బీసీ వెల్ఫేర్ డైరెక్టర్



వీరేశ్వరస్వామిని దర్శించుకున్న బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ మలికార్జున దంపతులు

ఐ.పోలవరం: నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ వీరేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ మల్లికార్జున దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. తొలుత వీరికి ఆలయ పర్యవేక్షణాధికారి కఠారి శ్రీనివాసరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు యనమండ్ర సుబ్బారావు ప్రత్యేక దర్శనం చేయించారు. అనంతరం స్వామి శేష వస్త్రం, ప్రసాదం, చిత్రపటాన్ని అందించి వేదాశీర్వచనం చేశారు.

రచయిత్రి సుధకు తెలుగు వెలుగు పురస్కారం



రచయిత్రి సుధను పురస్కారంతో సత్కరిస్తున్న నిర్వాహకులు

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన రచయిత్రి పచ్చిగోళ్ల సుధకు తెలుగు వెలుగు జాతీయ పురస్కారం లభించింది. తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ సంస్థ, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల వేదికపై సుధకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్, ఎమ్మెల్యే సుజనా చౌదరి తదితరుల చేతుల మీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు వెలుగు కోసం రచయిత్రి సుధ తన వంతు చేస్తున్న కృషికి గానూ ఆమెను ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు.

ముద్రగడ ఇంటిపై దాడి అమానుషం

తాళ్లరేవు: వైఎస్ఆర్ సీపీ నేత ముద్రగడ పద్మనాభం ఇంటిపై దాడిని పలువురు తీవ్రంగా ఖండించారు. కిర్లంపూడిలో ముద్రగడ ఇంటిని ఓ వ్యక్తి ఆదివారం తెల్లవారు జామున ట్రాక్టర్‌తో ఢీకొట్టి కారును ధ్వంసం చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కాదా గోవింద కుమార్, నాయకులు కాటంశెట్టి రామ్మూర్తి, బూరెల వెంకట్రాజు, ధూళిపూడి నాగేంద్ర ప్రసాద్, ఆకుల వెంకటేశ్వర్లు, దవులూరి శ్రీరామ్మూర్తి, శాఖా శంఖరుడు, ఎర్రంనీడి అప్పారావు, శ్రీపాదం శ్రీనివాస్ తదితరులు ఖండించారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మెగా శిబిరంలో 60 మంది రక్తదానం

మామిడికుదురు: కోనసీమ బ్లడ్ డోనర్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో 60 మంది దాతలు రక్తదానం చేశారు. మామిడికుదురు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనంలో ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ శిబిరం ఏర్పాటు చేశారు. దాతల నుంచి సేకరించిన రక్తం తలసేమియా, రక్తహీనత కలిగిన చిన్న పిల్లలు, గర్భిణులు, ప్రమాదాల బారిన పడి ప్రాణపాయ స్థితిలో ఉన్న వారికి ఉపయోగపడుతుందని సేవా సంస్థ అధ్యక్షులు కాండ్రేగుల నరేంద్ర తెలిపారు. సంస్థ ఏర్పాటు చేసిన నాటి నుంచి నేటి వరకు ఎంతో మందికి తమ సంస్థ ద్వారా రక్తదానం చేయడం ఆనందంగా ఉందన్నారు.